4న జరిగే నిరసనను విజయవంతం చేయాలి : జగదీశ్వర్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 30 : ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈనెల 4న హైదరాబాద్‌లో జరిగే నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీఈ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ అన్నారు. పట్టణ పరిధిలోని ఓ హోటల్‌లో జిల్లా టీఎన్‌జీఓస్ నాయకులు బుధవారం ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలు పేరుకుపోయాయని, సమస్యల పరిష్కారం కోసం నిర్వహించే నిరసనలో జిల్లాలోని ప్రభుత్వ ఉద్యోగులు హాజరు కావాలని చెప్పారు. కార్యక్రమంలో టీఎన్‌జీఓస్ రాష్ట్ర కార్యదర్శి ముజీబ్, టీజీఈ జేఏసీ జిల్లా అధ్యక్షుడు మందడి ఉపేందర్‌రెడ్డి, ధరణికోట భగత్, జగన్మోహన్, నాయకులు మహ్మద్ ఖదీర్, శ్రీకాంత్, పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

- కలెక్టర్ హనుమంతరావు

అంగన్‌వాడీ ఉద్యోగులను సన్మానిస్తున్న కలెక్టర్ హనుమంతరావు

భువనగిరికలెక్టరేట్, ఏప్రిల్ 30 : అంగన్‌వాడీ కేంద్రాల్లో విద్యార్థుల సంఖ్య పెంచి, నాణ్యమైన విద్యను బోధించాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. కలెక్టర్ కార్యాలయంలోని మహిళా, శిశు సంక్షేమ శాఖ కార్యాలయాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి మాట్లాడారు. అంగన్‌వాడీల ఆధ్వర్యంలో బడిబాట మాదిరిగానే ప్రత్యేక కార్యక్రమాన్ని చేపట్టాలని, సిబ్బంది బాధ్యతతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలకు అధిగమించాలని సూచించారు. ప్రభుత్వం రూ.లక్షలు వెచ్చించి నిరుపేద పిల్లల సంక్షేమం కోసం అంగన్‌వాడీ కేంద్రాలకు రూపకల్పన చేసిందని, పరిపూర్ణ ఆరోగ్యాన్ని అందించాలనే దృఢమైన సంకల్పంతో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణ జరుగుతుందన్నారు. అనంతరం ఉద్యోగ విరమణ పొందిన ఐసీడీఎస్ ఏసీడీపీఓ కె.రమ, సూపర్‌వైజర్ డి. ఊర్మిళను కలెక్టర్ సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమాధికారి కొండపురం నర్సింహారావు తదితరులున్నారు.

మహాత్మా శ్రీ బసవేశ్వర ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి కలెక్టర్ హనుమంతరావు పిలుపునిచ్చారు. బసవేశ్వర్ మహారాజ్ 892వ జయంతిని పురస్కరించుకుని మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి నివాళులర్పించి మాట్లాడారు. సమాజంలోని మూఢాచారాలను పారద్రోలి, కులమత రహిత సమాజాన్ని నిర్మించడంలో ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి యాదయ్య, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యామ్‌సుందర్, వివిధ కుల సంఘ నాయకులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పీఈఎల్‌లో మరో ఇద్దరు కార్మికుల దుర్మరణం

- ముగ్గురికి చేరిన మృతుల సంఖ్య
- మోటకొండూర్, కాటేపల్లి గ్రామాల్లో విషాదఛాయలు
- న్యాయం చేయాలని నాలుగు గంటలు రాస్తారోకో
- మృతుల కుటుంబానికి రూ.కోటి చొప్పున సాయం ప్రకటించిన కంపెనీ.. ఒకరికి ఉద్యోగం

కాటేపల్లిలో మృతుడి కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

మోటకొండూర్, ఏప్రిల్ 30 : మండలంలోని కాటేపల్లిలో గల ప్రీమియర్ ఎక్స్‌ప్లోజివ్ కంపెనీలో మంగళవారం సాయంత్రం జరిగిన పేలుడు ప్రమాదంలో శిథిలాల కింద గల్లంతైన మరో ఇద్దరు కార్మికులు కూడా దుర్మరణం చెందారు. చనిపోయిన వారిలో మోటకొండూర్ మండల కేంద్రానికి చెందిన చందోజు దేవిచరణ్, కాటేపల్లికి చెందిన గునుగుంట్ల సందీప్ ఉన్నారు. గల్లంతైన వీరిని రాత్రి అంతా గాలించిన బాంబ్ స్క్వాడ్, సిబ్బంది బుధవారం ఉదయం దేవిచరణ్ డెడ్ బాడీని వెలికితీశారు. కానీ సందీప్ డెడ్‌బాడీ ముద్దలు ముద్దలుగా లభించింది. ప్రమాదంలో మొత్తం మృతుల సంఖ్య మూడుకు చేరింది. ఈ సంఘటనతో మోటకొండూర్, కాటేపల్లి గ్రామాల్లో విషాద చాయలు అలుముకున్నాయి.

మోటకొండూర్ మండలంలోని కాటేపల్లిలో రాయగిరి-మోత్కూరు రహదారిపై రాస్తారోకో నిర్వహిస్తున్న ప్రజలు, గ్రామస్తులు, మృతుల కుటుంబ సభ్యులు

మృతుల కుటుంబాల్లో కన్నీరే మిగిలింది..

పేలుడు ప్రమాదంలో మృతిచెందిన కుటుంబాలు శోకసంద్రంలో మునిగిపోయాయి. మృతదేహాలు ఛిద్రం కావడంతో ముఖం చూసుకోవడానికి అవకాశం లేకుండా పోయింది. మోటకొండూర్‌కి చెందిన మృతుడు దేవిచరణ్ ఒక్కడే కొడుకు. ఇంకా పెండ్లి కాలేదు. ప్రమాదంలో మరణించడంతో తల్లి రోదనకు అవధులు లేకుండా పోయాయి. కాటేపల్లికి చెందిన మృతుడు సందీప్‌కు నెలల క్రితమే వివాహం జరిగింది. తన భర్తను ఆఖరి చూపు కూడా చూడలేదని సందీప్ భార్య రోదిస్తుంటే అక్కడ ఉన్న వారి మనస్సు కలచివేసింది. ముఖం చూసే భాగ్యం కూడా కల్పించ లేదని ఆవేదనతో కుటుంబంతోపాటు గ్రామస్తులు శోకసంద్రంలో మునిగిపోయారు.

రాస్తారోకోతో బిగొచ్చిన కంపెనీ యాజమాన్యం

పేలుడు ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం రాయగిరి-మోత్కూరు రహదారిపై మండల ప్రజలు, గ్రామస్తులు, మృతుల బంధువులు పెద్దఎత్తున రాస్తారోకో నిర్వహించారు. సుమారు 4 గంటల పాటు రోడ్డు దిగ్బంధనం చేసి ఆందోళన చేశారు. దీంతో పోలీసులు వాహనాలను వేరే మార్గంలో దారి మళ్లించారు. మృతుల కుటుంబాలకు న్యాయం చేయాలని పలువురు ప్రజాప్రతినిధులు కంపెనీ యాజమాన్యంపై ఒత్తిడి తేవడంతో దిగొచ్చింది. మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ.కోటి ఆర్థిక సాయంతో పాటు ఒకరికి ఉద్యోగం ఇస్తామని ప్రకటించింది. వెంటనే రూ. 50 లక్షలు ఇచ్చి మరో రూ. 50లక్షలు ఇవ్వనున్నట్లు తెలిపింది. క్షతగాత్రులకు తక్షణ సాయంగా రూ.5లక్షలు, వారి వైద్యానికి పూర్తి ఖర్చు భరిస్తామని, ఆరోగ్యం మెరుగుపడే వరకు సెలవులు ఇస్తామని, జీతం మాత్రం యథావిధిగా అందిస్తామని హామీ ఇచ్చింది. దీంతో రాస్తారోకోను విరమించారు. కంపెనీ యాజమాన్యం స్వలాభాల కోసం కాంట్రాక్ట్ ఉద్యోగులతో పని చేయిస్తున్నదని, ఒక్కో కార్మికుడికి రోజుకు రూ.400 ఇస్తూ కనీస భద్రతా చర్యలు పాటించడం లేదని ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు ఆరోపించారు. ఈ ప్రమాదంలో కాటేపల్లిలో ఓ భూకంపం వచ్చినట్లు ఇండ్లలోని వస్తువులు చెల్లాచెదురుగా పడ్డాయని, ప్రతి కార్మికుడితో వెట్టిచాకిరి చేయించుకుంటున్నారని మండిపడ్డారు. తమకు పరిశ్రమలు వద్దని, ఇక్కడి నుంచి తరలించాలని గ్రామానికి చెందిన ఓ మహిళ ఆవేదనతో తెలిపింది.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ప్రముఖులు

కాటేపల్లి పీఈఎల్ కంపెనీలో జరిగిన ప్రమాద స్థలాన్ని బుధవారం మాజీ ప్రభుత్వ విప్ గొంగిడి సునీత, డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డితోపాటు భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న వేర్వేరుగా పరిశీలించారు.ప్రమాదానికి గల కారణాలను కంపెనీ సిబ్బందితో మాట్లాడి తెలుసుకున్నారు. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని హామీ ఇచ్చారు. కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని చెప్తామని తెలిపారు.

నరేశ్ మృతితో ఆత్మకూరు(ఎం)లో విషాద ఛాయలు

నరేశ్ (ఫైల్)

ఆత్మకూరు(ఎం) : కాటేపల్లి వద్ద జరిగిన పేలుడు ప్రమాదంలో ఆత్మకూర్.ఎం మండల కేంద్రానికి చెందిన కల్వల నరేశ్ మృతి చెందాడు. నరేశ్ రెండు నెలల క్రితమే కంపెనీలో కాంట్రాక్టర్ ఉద్యోగిగా చేరాడు. నరేశ్‌కు భార్య, రెండు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. నరేశ్ తండ్రి అంజయ్య తాపిమేస్త్రీగా జీవనం సాగిస్తుండగా ఒక్క కొడుకు మృతి చెందడంతో వారి కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. పలకరించే నరేశ్ మృతితో గ్రామంలో విషాదచాయలు నెలకొన్నాయి.

మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం

కాటేపల్లి పీఈఎల్‌లో జరిగిన ప్రమాదంలో మండల కేంద్రానికి చెందిన చందోజు దేవిచరణ్ మృతి చెందగా మృతుడి కుటుంబాన్ని డీసీసీబీ మాజీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. అనంతరం రూ. 10వేల ఆర్థికసాయం అందించారు. బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బొట్ల యాదయ్య, నాయకులు భూమండ్ల ఐలయ్య, ఎగ్గిడి కృష్ణ, బురాన్, జివిలికపల్లి వెంకటేశ్, గంధమల్ల మధు, కాదూరి ఎల్లేందర్ ఉన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి

- అదనపు కలెక్టర్ వీరారెడ్డి

యాదగిరిగుట్ట : మైలారిగూడెంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

యాదగిరిగుట్ట, ఏప్రిల్ 30 : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. మండలంలోని మైలారిగూడెంలో యాదగిరిగుట్ట పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆయన అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరును పరిశీలించి, రైతులకు ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తెచ్చిన ధాన్యం వివరాలు ఎప్పటికప్పుడు రిజిస్టర్‌లో నమోదు చేయాలన్నారు. ఒక్క రైతు కూడా నష్టపోవడానికి వీల్లేదని, దళారులను ఆశ్రయించి తక్కువ ధరకు ధాన్యం విక్రయించుకోవద్దని సూచించారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకుని మద్దతు ధర పొందాలని రెప్పారు. సిబ్బంది అప్రమత్తంగా ఉండి, అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆయన వెంట పీఏసీఎస్ సీఈఓ అంజనేయులు, రైతులు ఉన్నారు.

ప్రభుత్వ మద్దతు ధరను పొందాలి : తాసీల్దార్

చౌటుప్పల్ రూరల్ : ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో విక్రయించి మద్దతు ధరను పొందాలని తాసీల్దార్ హరికృష్ణ అన్నారు. చౌటుప్పల్ మండలంలోని పంతంగి, అంబిరెడ్డిగూడెం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన సందర్శించి మాట్లాడారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆలేరురూరల్ : ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని ఏఓ శ్రీనివాస్ అన్నారు. మండలంలోని టంగుటూరులో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించి మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓలు నాగార్జున, శివకుమార్, రైతులు ఉన్నారు.

భూదాన్‌పోచంపల్లి : మండలంలోని ఇంద్రియాల గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మాజీ సర్పంచ్ బండి కృష్ణగౌడ్ బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మొగిలిపాక యాదగిరి, నాయకులు పాల్గొన్నారు.

బచ్చలి అలేఖ్య /562 కొత్త అఖిల /558 బొంత అర్చన /555 సంద్ర సాత్విక్/555 జానేరియా మహబిష్/544

'పది' ఫలితాల్లో సర్వేల్ గురుకులానికి 100శాతం ఉత్తీర్ణత

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో మండల పరిధిలోని సర్వేల్ గురుకుల పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలకు చెందిన సంద్ర సాత్విక్ 555 మార్కులు సాధించగా, 40 మంది విద్యార్థులు 540 మార్కులకు పైగా సాధించారు. మండల కేంద్రంలోని మోడల్ స్కూల్ విద్యార్థినిలు కూడా ఉత్తమ ప్రతిభతో సత్తా చాటారు. మొత్తం 84 మంది విద్యార్థులకు గానూ 83 మంది ఉత్తీర్ణత సాధించారు. ప్రభుత్వ పాఠశాలల్లో టాప్ మూడు ర్యాంకులను మోడల్ స్కూల్ విద్యార్థులు సాధించారు. సర్వేల్ జడ్పీ హెచ్ఎస్ 100 శాతం, నారాయణపురం జడ్పీ హెచ్ఎస్ 97 శాతం, పుట్టపాక 97, జనగాం 100 శాతం, గుజ్జ 100, నారాయణపురం బాలికల జడ్పీహెచ్ఎస్ 100 శాతం, నారాయణపురం కేజీబీవీ 100 శాతం, టీఎస్ఎంస్ నారాయణపురం 98 శాతం ఉత్తీర్ణత సాధించాయి.

మండల టాపర్ శ్యామ్‌ప్రసాద్‌కు 568 మార్కులు

మోత్కూరు : పదో తరగతి ఫలితాల్లో ఎస్సీ గురుకుల పాఠశాల విద్యార్థి పి.శ్యామ్ ప్రసాద్ 568 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచాడు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన డి.అర్చన 541 మార్కులు సాధించారు.

రామన్నపేట గురుకులంలో..

రామన్నపేట : మండలంలోని జనంపల్లి గురుకుల పాఠశాలలో 72 మంది విద్యార్థినులకు గాను 72 మంది ఉతీర్ణులయ్యారు. బచ్చలి అలేఖ్య 562, కొత్త అఖిల 558, బొంత అర్చన 555 మార్కులు సాధించి టాపర్లుగా నిలిచారు.

విద్యార్థి భరత్‌కు కలెక్టర్ అభినందన

సంస్థాన్ నారాయణపురం, ఏప్రిల్ 30 : మండలంలోని శేరిగూడెం గ్రామానికి చెందిన పదో తరగతి విద్యార్థి భరత్ చంద్ర కుటుంబ పరిస్థితి బాగాలేక గతంలో పాఠశాలకు వెళ్లడం లేదు. స్పందించిన కలెక్టర్ హనుమంతరావు తలుపు తట్టే కార్యక్రమంలో భాగంగా గతంలో భరత్ ఇంటికి వెళ్లి కారణాలు తెలుసుకొని అండగా ఉంటానని హామీ ఇచ్చి ఆర్థికసాయం చేస్తూ పాఠశాలకు వెళ్లాలని ప్రోత్సహించారు. భరత్ చదువు పూర్తి బాధ్యత తీసుకుంటానని హామీ కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో బుధవారం విడుదలైన పదో తరగతి ఫలితాల్లో భరత్ 438 మార్కులు సాధించి ఫస్ట్ క్లాస్‌లో పాస్ కావడంతో విషయం తెలుసుకున్న కలెక్టర్ విద్యార్థి భరత్‌కు ఫోన్ చేసి అభినందించారు. రెండ్రోజుల్లో ఇంటికి వచ్చి సన్మానిస్తానని చెప్పారు. పాలిటెక్నిక్ ఎంట్రన్స్ పరీక్షకు కావాల్సిన మెటీరియల్స్ పంపుతున్నానని, బాగా చదివి మంచి ర్యాంక్ సాధించాలని సూచించారు.

చిన్నారులకు క్రికెట్ కిట్ అందజేత

చిన్నారులకు క్రికెట్ కిట్టు అందించిన రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 30 : భువనగిరి పట్టణంలోని విద్యానగర్ కాలనీలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర బుధవారం ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరయ్యారు. తిరుగు ప్రయాణంలో రోడ్డు పక్కన క్రికెట్ ఆడుకుంటున్న చిన్నారులను గమనించి వారితో మాట్లాడారు. తమకు సరైన ఆట వస్తువులు లేవని పిల్లలు ఎంపీకి తెలుపడంతో వెంటనే తన కారులో వారిని దగ్గర్లోని స్పోర్ట్స్ షాప్‌కు తీసుకెళ్లి క్రికెట్ కిట్లు ఇప్పించారు. మళ్లీ స్వయంగా వారిని ఇంటి దగ్గర దింపి ఆటలతో పాటు చదువుల్లో రాణించాలని సూచించారు.

భూ సమస్యల పరిష్కారం కోసమే భూ భారతి : ఎమ్మెల్యే

భూ భారతి పోస్టర్ ఆవిష్కరించిన ఎమ్మెల్యే అనిల్, కలెక్టర్

భువనగిరి అర్బన్ : భూ సమస్యల పరిష్కారానికే ప్రభుత్వం భూ భారతి చట్టాన్ని ఏర్పాటు చేసిందని ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్ రెడ్డి అన్నారు. పట్టణంలోని మార్కెట్‌యార్డు ఆవరణలో బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో భూ భారతి చట్టం ప్రయోజనాల పోస్టర్‌ను కలెక్టర్ హనుమంతరావుతో కలిసి ఆయన ప్రదర్శించి మాట్లాడారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, ఏఎంసీ చైర్మన్ రేఖ, గ్రంథాలయ చైర్మన్ అవేజ్ చిస్తీ, నాయకులు ఎలిమినేటి కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

జనంలేక ఖాళీ కుర్చీలు

భూ భారతి చట్టంపై అవగాహన కల్పించేందుకు మార్కెట్ యార్డు ఆవరణలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో రైతులు, ప్రజలు హాజరు కాకపోవడంతో ఖాళీ కుర్చీలు దర్శనమిచ్చాయి.

బసవేశ్వరుడి జయంతి

మోత్కూరు, ఏప్రిల్ 30 : బసవేశ్వరుడి జయంతి సందర్భంగా పట్టణంలోని జామచెట్లబావి క్రాస్ రోడ్డులో గల ఆయన విగ్రహానికి లింగాయత్ బలిజలు ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టూరి అంజయ్య, గుండా శేఖర్, బి.విజయ్‌కుమార్, సందనాగరాజు, ఆకుల సోమయ్య, పట్టూరి శివ, ఆరాని శేఖర్, గోశెట్టి వీరసోమయ్య, ఇమ్మడి మహేశ్, మడిగె భూమయ్య పాల్గొన్నారు.

రామన్నపేట : తాసీల్దార్ కార్యాలయంలో బసవేశ్వర జయంతి సందర్భంగా ఆయన చిత్ర పటం తాసీల్దార్ లాల్‌బహదూర్, సిబ్బంది నివాళులర్పించారు.

మే 2న చేనేత సభను విజయవంతం చేయాలి : వెంకటేశ్

మాట్లాడుతున్న రాష్ట్ర చేనేత నాయకుడు తడక వెంకటేశ్

భూదాన్‌పోచంపల్లి, ఏప్రిల్ 30 : మే 2న ఉదయం 11 గంటలకు భూదాన్‌పోచంపల్లిలో పద్మశాలి సభా వేదిక వద్ద చేనేత పరిరక్షణ కోసం రాజకీయాలకతీతంగా నిర్వహించే సభకు నాయకులు, కార్మికులు, వ్యాపారులు పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర చేనేత నాయకుడు తడక వెంకటేశ్ పిలుపునిచ్చారు. పట్టణ కేంద్రంలోని చేనేత సహకార సంఘం భవన్‌లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కార్యక్రమానికి మంత్రులు తుమ్మల నాగేశ్వర్‌రావు, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎంపీ కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి హాజరు కానున్నట్లు తెలిపారు. పోచంపల్లిలో ఇక్కత్ పరిశ్రమపై అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. చేనేత పరిరక్షణ, సమస్యల పరిష్కారంపై నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షుడు భారత లవకుమార్, పోచంపల్లి బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్, పద్మశాలి చేనేత కార్మిక సంఘం అధ్యక్షుడు అంకం పాండు, చింతకింది రమేశ్, సీత సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

2న పోచంపల్లి బ్యాంక్ నూతన భవనం ప్రారంభం

మే 2న పట్టణ కేంద్రంలోని పోచంపల్లి కో-ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ కేంద్ర కార్యాలయం నూతన భవనాన్ని ప్రారంభించనున్నట్లు బ్యాంక్ చైర్మన్ తడక రమేశ్, సీఈఓ సీత శ్రీనివాసులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖాతాదారులు వాటాదారులు, వ్యాపారులు, ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

'విజ్ఞాన్' స్కూల్‌కు జిల్లాలో మొదటి స్థానం

విజయకేతనం చూపుతున్న విజ్ఞాన్ స్కూల్స్ చైర్మన్ పడిగాల జలంధర్‌రెడ్డి

భువనగిరి అర్బన్ : పదో ఫలితాల్లో భువనగిరి పట్టణంలోని విజ్ఞాన్ స్కూల్ జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. పాఠశాలకు చెందిన ఎం.అక్షయ 583 మార్కులు సాధించి జిల్లా ఫస్ట్ ర్యాంక్ సాధించగా పాఠశాలలో మొత్తం 66 మంది విద్యార్థుల్లో 7గురికి 550 పైగా మార్కులు వచ్చాయి. 23 మంది విద్యార్థులకు 500కు పైగా, 58 మంది 400పైగా మార్కులతో ఉత్తీర్ణత సాధించారు. పాఠశాలలో మొత్తం 66 మంది ఉండగా అందులో ప్రథమ శ్రేణిలో ఉత్తీర్ణత సాధించిన వారు 64 మంది విద్యార్థులు ఉన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను బుధవారం విజ్ఞాన్ పాఠశాలల చైర్మన్ పడిగాల జలంధర్‌రెడ్డి అభినందించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ పడిగాల పురేందర్ రెడ్డి, ప్రిన్సిపాల్స్ అపర్ణ, స్వాతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

టెన్త్ ఫలితాల్లో 'సాధన' విద్యార్థుల ప్రతిభ

విజయకేతనం చూపుతున్న సాధన ఉన్నత పాఠశాల కరస్పాండెంట్ జిట్టా ధనాఫ్‌రెడ్డి, విద్యార్థులు

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 30 : పదో తరగతి ఫలితాల్లో పట్టణంలోని సాధన ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి జిల్లాలో పాఠశాలను మూడో స్థానంలో ఉంచారు. మొత్తం 39 మంది విద్యార్థులకు గాను 39 మంది ఉత్తీర్ణత సాధించి 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. ఫలితాల్లో ఇ.రిషిత 559, రోహిబేగం 555, ఫరీహా ఫాతిమా 554, ఎస్.అపూర్వ 551తో పాటు మొత్తం 11 మంది విద్యార్థులు 500 పైగా మార్కులు సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ జిట్టా ధనాఫ్‌రెడ్డి, ప్రిన్సిపాల్ సంగిత విద్యార్థులను అభినందించారు. అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లను పంపిణీ చేశారు.

నిరుపేదలకు ఇండ్ల స్థలాలు ఇవ్వాలి : సీపీఐ

కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్

భువనగిరికలెక్టరేట్, ఏప్రిల్ 30 : నిరుపేదలకు ఇంటి స్థలాలు, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గోదా శ్రీరాములు, జిల్లా కార్యవర్గ సభ్యుడు ఏశాల అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పార్టీ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తాసీల్దార్ కార్యాలయాన్ని ముట్టడించి మాట్లాడారు. పట్టణంలోని ప్రభుత్వ భూములు, మండలంలోని హన్మాపురం, బొమ్మాయిపల్లి ప్రభుత్వ భూములను వెంటనే నివేషణ స్థలాలకు ఇచ్చి, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు. స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఇంటి స్థలాలు ఇప్పిస్తామని చెప్పిన హామీ నిలబెట్టుకోవడంలో విఫలమయ్యారని మండిపడ్డారు. అన్యాక్రాంతం అవుతున్న ప్రభుత్వ భూములన్నింటినీ కాపాడి, ఆక్రమణ దారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తాసీల్దార్ అంజిరెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి పుట్ట రమేశ్, మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు సోమన సబిత, జిల్లా కౌన్సిల్ సభ్యులు వస్తూపుల అభిలాష్, దాసరి లక్ష్మయ్య, చింతల పెంటయ్య, చింతల మల్లేశం, ఎండీ బాబా, ఎస్‌కే అమీర్, బాలమణి, అలివేలు, అస్మా బేగం, ఉమారాణి పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికలో అవకతవకలపై విచారణ జరుపాలని వినతి

మోత్కూరు, ఏప్రిల్ 30 : మండలంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో జరిగిన అవకతవకలపై విచారణ జరుపాలని కోరుతూ బీఎస్పీ ఆధ్వర్యంలో ఎంపీడీఓ బాలాజీకి బుధవారం వినతి పత్రం అందించారు. అనంతరం పార్టీ జిల్లా కో అర్డినేటర్ కొంపెల్లి బాలరాజు మాట్లాడుతూ దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న పేదలను గుర్తించి ఇందిరమ్మ ఇండ్లకు ఎంపిక చేయాలని ప్రభుత్వం ఆదేశాలు చేసినప్పటికీ వాటిని ఉల్లంఘించి అనర్హులను ఎంపిక చేస్తున్నారన్నారు. అర్హులకు కాకుండా గ్రామాల్లో అధికార పార్టీ కండువాలు కప్పుకున్న వారిని లబ్ధిదారులుగా ఎంపిక చేస్తున్నారని ఆరోపించారు. ఇదే విషయమై కలెక్టర్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో జిట్ట మురళి, కొంపెల్లి రామకృష్ణ ఉన్నారు.

అకాల వర్షంతో తడిసిన ధాన్యం

అడ్డగూడూరులో ధాన్యం రాశిపై నిలిచిన నీటిని ఎత్తిపోస్తున్న రైతు

అడ్డగూడూరు, ఏప్రిల్ 30 : మండల కేంద్రంలో బుధవారం సాయంత్రం ఈదుగాలులతో వర్షం కురిసింది. దీంతో కొన్ని ఇండ్ల రేకులు లేచిపోగా, పలుచోట్ల చెట్లు నేలకొరిగాయి. వర్షానికి కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసి ముద్దయ్యింది.

హమాలీల కొరతతో కొనుగోళ్లు ఆలస్యం

మండలకేంద్రంలోని ఐకేపీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో ఏపీఎం వెంకటేశ్వర్లు 10 మంది బీహార్ కూలీలను తీసుకొచ్చారు. వాళ్లు రోజుకు 800 నుంచి 900 బస్తాలు మాత్రమే తూకం వేస్తుండడంతో కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయని రైతులు చెబుతున్నారు. మరో 10 మందిని పంపాలని కొనుగోలు కేంద్రం నిర్వాహకులు ఏపీఎం వ